క్లుప్తంగా

నేడు మంత్రి వివేక్ పర్యటన

గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్, వర్గల్, జగదేవ్‌పూర్, మర్కూక్, ములుగు మండలాల్లో ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు వర్గల్ మండలం శాకారం టీజీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అదేవిధంగా గజ్వేల్‌లోని ఎస్ఎమ్ గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు, జగదేవ్‌పూర్‌లోని కేశిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఫంక్షన్ హాలులో 11 గంటలకు, 12 గంటలకు మర్కూక్‌లో రైతు వేదిక, 1గంటకు ములుగులోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న రేషన్ కార్డులను పంపిణీలో పాల్గొంటారు.

అవినీతిలో భాగమైన వారిపై చర్యలు

డీసీసీ కార్యదర్శి నాగరాజు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోదూరు(సిద్దిపేట): కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై జరిపిన విచారణ రిపోర్టు ప్రభుత్వానికి అందిందని, ఇందులో భాగమైన ప్రతి ఒక్కరిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డీసీసీ కార్యదర్శి మీసం నాగరాజు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అనంతగిరి రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులకు సరైన నష్టపరిహారం ఇవ్వకుండా మోసం చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు ముంపు ప్రజల గోస తగులుతుందని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్, హరీశ్‌రావు కోట్లు దండుకున్నారని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గణేశ్, మహేందర్ రెడ్డి, స్వామి, గణపతి, మల్లేశం ఉన్నారు.

నీటి విడుదల కోసం వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: కొడకండ్ల కాల్వ నుంచి నీటిని విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆర్డీఓ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక గ్రామాల్లో వరినాట్లు వేసి నెలరోజులు కావస్తున్నా సరిపడా సాగునీరులేక ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి జగదేవ్‌పూర్ మండల పరిధిలోని కాల్వల నిర్మాణాలను పూర్తి చేయాలని, మునిగడప, తిమ్మాపూర్ తదితర గ్రామాల పరిధిలోని చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో ఎంతో మేలు: ఏఓ గీత



అవగాహన కల్పిస్తున్న ఏఓ గీత

నంగునూరు(సిద్దిపేట): నానో యూరియా వాడడం వల్ల ఖర్చులు తగ్గి రైతులకు మేలు జరుగుతుందని ఏఓ గీత అన్నారు. శనివారం ముండ్రాయిలో రైతు చారగొండ రజనీకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి వరి పొలంలో నానో యూరియా స్ప్రే చేసి రైతులకు అవగాహన కల్పించారు. కొందరు రైతులు ముందుకు రావడంతో మరో 30 ఎకరాల పొలంలో నానో యూరియా స్ప్రే చేశారు. రెండవ దఫా యూరియా వేసే సమయంలో నానో యూరియా స్ప్రే చేయాలని ఏఓ, ఏఈఓ చైతన్య తెలిపారు.

అమరుల స్ఫూర్తి మరువలేనిది

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నేత గోపి



చైతన్యయాత్రలో పాల్గొన్న గీత కార్మికులు

కొమురవెల్లి(సిద్దిపేట): కల్లు గీత కార్మికుల సమస్యలపై పోరాడి జీవితాలు త్యాగం చేసిన అమరుల స్ఫూర్తి మరువలేనిదని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక గీత కార్మికులతో కలసి అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర నిర్వహించారు. పంచాయతీ నుంచి పోలీస్‌బొమ్మ వరకు బైక్ ర్యాలీ చేశారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణ్, రాజుగౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న ‘వడలు’ తెగులు

మొక్కజొన్న సాగులో గుర్తింపు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- సస్యరక్షణతో పంటను కాపాడవచ్చు
- శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి



వడలు తెగులు గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త పల్లవి, పక్కన ఏఓ శేషశయన

వర్గల్(గజ్వేల్): అధిక వర్షాలు కురిసిన తరుణంలో మొక్కజొన్న పైరుకు వడలు(విల్ట్) తెగులు ఆశించే ఆస్కారముంది. దీని ప్రభావంతో కర్ర ఎండిపోయి పంట దిగుబడి తగ్గుతుంది. వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో వడలు తెగులు సోకిన మొక్కజొన్న పైరును తోర్నాల రైతు విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ పల్లవి, ఏఓ శేషశయన, ఏఈఓ భారతితో కలిసి శనివారం పరిశీలించారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

మొక్కజొన్న పీచు దశలో వడలు తెగులు సోకినట్లు గుర్తించారు. ఈ తెగులు సోకిన మొక్క కణుపు మధ్య భాగాలు కుళ్లి నలుపుగా మారుతాయి. ఆకులు పసుపురంగులోకి మారి కర్ర క్రింది భాగం నుంచి పైదాకా ఎండిపోతాయని ఆమె వివరించారు. పక్కన మరో మొక్క దీని ప్రభావానికి గురికాకుండా తగు సస్యరక్షణ పద్ధతులు ఆచరిస్తే ఈ తెగులు బారి నుంచి పంటను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. ప్రస్తుతం అధిక వర్షాల కారణంగా వడలు తెగులు(విల్ట్) వచ్చే అవకాశముందని, నివారణకు ఆచరణీయమైన సస్యరక్షణ పద్ధతుల గురించి ఆమె అన్నదాతలకు వివరించారు.

వరిలో ఎరువులు ఇలా..

వరినాట్లు వేసేటపుడు ఒక ఎకరాకు బస్తా డీఏపీ, 15 కిలోల పొటాష్, నాటిన 30 రోజులకు ఒక బస్తా యూరియా, 55 రోజులకు ఒక బస్తా యూరియా, 15 కిలోల పొటాష్ వేయాలి. ఆఖరి దుక్కిలో 20:20:0:13కు బదులు డీఏపీ వేసుకోవాలి. దీంతో వరి ఎర్రబడకుండా సల్ఫైడ్ దుష్ప్రభావం తగ్గుతుంది.



వడలు తెగులుతో ఎండిపోయిన మొక్కజొన్న కర్ర

నివారణకు సూచనలు..
- వడలు తెగులు రాకుండా కిలో మొక్కజొన్న విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మా శిలీంద్రాన్ని కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. ఆ తరువాత విత్తుకోవాలి
- 2 కిలోల ట్రైకోడెర్మా శిలీంద్రాన్ని100 కిలోల పశువుల ఎరువులో వృద్ధిచేసి వరుసగా మూడు, నాలుగు సంవత్సరాలు నేలలో కలపాలి
- సాగులో వడలు తెగులు గమనించినప్పుడు శిలీంద్రనాశిని మందు కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ)ను ఒక లీటరు నీటికి 3 గ్రాములు చొప్పున కలిపి మొక్కల వేర్లు తడిచే విధంగా పిచికారీ చేయాలి. దీంతో పక్క మొక్కలకు శిలీంద్రం వ్యాపించదు
- మొక్కజొన్న పంట విత్తినప్పుడు దుక్కిలో ఒకబస్తా డీఏపీ, 15 కిలోల పోటాష్ వేసుకుంటే మొక్క కొంత వరకు వడలు తెగులును తట్టుకుంటుంది
- మొక్కజొన్న తర్వాత పప్పుదినుసు పంటలతో పంట మార్పిడీ చేయాలి

ఇతర పంటలలో..

పత్తి విత్తేటప్పుడు ఒకబస్తా డీఏపీ వేయాలి. 20, 40, 60 రోజులకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులు వేయాలి. మొక్కజొన్న పంట విత్తినపుడు ఒక బస్తా డీఏపీ, 15 కిలోల పొటాష్, 30 రోజులకు (మోకాలు ఎత్తు దశ) ఒకటిన్నర బస్తాల యూరియా, 55 రోజులకు(పూత దశ) ఒకటిన్నర బస్తాల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకుంటే సరిపోతుందన్నారు.



చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న సీడీపీఓ రమాదేవి

తల్లిపాలు పిల్లల ఆరోగ్యానికి మేలు

సీడీపీఓ రమాదేవి

చేర్యాల(సిద్దిపేట): తల్లిపాలు పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని సీడీపీఓ రమాదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రవసమైన తల్లులకు ఆకునూరు సెక్టార్ సూపర్‌వైజర్ పావనితో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే తల్లిపాలు పట్టాలన్నారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు తాగిన చిన్నారుల్లో రోగ నిరోధకశక్తి అధికంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. టీచర్లు కత్తుల అండాలు, గర్నపల్లి ఉపేంద్ర, హెచ్‌ఎం కిషన్ మాట్లాడారు. ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతపై టీచర్లు తల్లులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాలల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమృతంతో సమానం

దుబ్బాక: తల్లిపాలు అమృతంతో సమానమని దుబ్బాక సెక్టార్ సూపర్‌వైజర్ చంద్రకళ అన్నారు. పట్టణంలోని 2వ కేంద్రం, చేర్వాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

చిన్నకోదూరు(సిద్దిపేట): తల్లిపాలతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి చెప్పారు. మండల పరిధి గంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. తల్లిపాలలో ఉన్న పోషకాలు డబ్బాపాలలో ఉండవన్నారు. టీచర్‌లు శారద, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల కోసం పోరాడిన గద్దర్

- 6న హైదరాబాద్‌లో రెండో వర్ధంతి సభ
- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

దుబ్బాకటౌన్: గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గద్దర్ ద్వితీయ వర్ధంతిసభ నిర్వహిస్తున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు. రాయపోల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సభకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం గద్దర్ జీవితాంతం పోరాడారన్నారు. ఈ సభకు కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకటౌన్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న శంకర్ తదితరులు

విజయవంతం చేయాలి

గజ్వేల్‌రూరల్: స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులు గద్దర్ ద్వితీయ వర్ధంతి సభను విజయవంతం చేయాలన్నారు. కనక ప్రసాద్, ఆరేకులు, కిరణ్, స్వామి పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

సీనియర్ శాస్త్రవేత్త రాజ్‌గోపాల్‌శర్మ

సిద్దిపేటఎడ్యుకేషన్: ఆధునిక ప్రపంచంలో వివిధ రంగాల్లో కొత్త అవకాశాలను సృష్టించే అద్భుత శక్తి రసాయనశాస్త్రానికే ఉందని డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజగోపాల్‌శర్మ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో శనివారం భారత రసాయనశాస్త్ర పితామహుడు ఆచార్య ప్రఫుల్ల చంద్రరాయ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రసాయనశాస్త్ర ప్రాముఖ్యత– ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మెడిసిన్, ఫార్మా, నానోటెక్నాలజీ, పెట్రో, గ్రీన్, ఫుడ్‌సైన్స్, రక్షణ తదితర రంగాల్లో కెమిస్ట్రీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు కెమిస్ట్రీపై ఆసక్తి పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. అనంతరం కళాశాల కెమిస్ట్రీ ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, సీఓఈ డాక్టర్ గోపాల సుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్ ప్రసంగించారు. అనంతరం రాజ్‌గోపాల్ శర్మను సన్మానించారు. కార్యక్రమంలో ఆచార్యులు రవి, సుమలత, భాస్కర్, శ్రీనివాస్, బాలకిషన్, మనోహర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజ్‌గోపాల్‌శర్మ

పాఠశాలలకు దాతల సహకారం అవసరం

ఎంఈఓ సత్తయ్య

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం దాతల సహకారం అవసరమని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. మండలంలోని తిప్పారం హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో దాత సయ్యద్ తఫ్రీజ్ దంపతుల సహకారంతో 120 మంది విద్యార్థులకు షూ, టై బెల్ట్‌లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలందించిన సహకారం సద్వినియోగం అయ్యేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. దాతల సహాయ సహకారాలతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం గొప్ప విషయమన్నారు. మరింతగా దాతలు ముందుకు రావాలని కోరారు. తఫ్రీజ్ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చీల రవి, ఉపాధ్యాయులు శివకుమార్, అరుణ, అంజయ్య, అనల్, రవీందర్, కనకయ్య, రామకృష్ణరెడ్డి, మాధురి, సీఆర్పీ సంతోష్, ఏఏపీసీ చైర్ పర్సన్ రేణుక పాల్గొన్నారు.



విద్యార్థులకు షూ, బెల్ట్‌లు అందజేస్తున్న ఎంఈఓ

బీఆర్‌ఎస్‌తోనే ఆలయాల అభివృద్ధి

ఎమ్మెల్యే హరీశ్‌రావు



ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాల్లో శనివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మోహినిపుర వెంకటేశ్వర ఆలయ ఆవరణలో అన్నదాన భవన నిర్మాణ పనులను పరిశీలించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవనానికి అవసరమయ్యే గ్రానైట్‌ను విరాళంగా అందజేస్తానని ప్రకటించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ప్రాంగణంలో రూ.15 లక్షల తో నిర్మిస్తున్న అన్నదాన భవనం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాన భవనాల నిర్మాణాలు వేగంగా జరగాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాల పరామర్శ

నంగునూరు(సిద్దిపేట): ఇటీవల అనారోగ్యంతో మరణించిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే హరీశ్ రావు పరామర్శించారు. అంక్షాపూర్‌కు చెందిన రుక్మారెడ్డి తల్లి, మగ్దుంపూర్‌కు చెందిన బండి సాయిలు తల్లి, సిద్దన్నపేటకు చెందిన కత్తుల శంకర్ రెడ్డి తల్లి మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి భరోసా ఇచ్చారు.

క్రమశిక్షణతోనే మంచి గుర్తింపు

అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్

చిన్నకోదూరు(సిద్దిపేట): పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తే పోలీస్‌శాఖకు మంచి గుర్తింపు వస్తుందని అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెద్దకోదూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి శనివారం నిర్వహించిన పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది క్రమం తప్పకుండా వాకింగ్, రన్నింగ్, యోగా వంటివి చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అప్పుడే ఎలాంటి అనారోగ్యానికి గురి కాకుండా విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, ఇన్స్‌పెక్టర్‌లు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

- ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి
- టీపీటీఎఫ్ రాష్ట్రనేత తిరుపతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నూతన ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు కావస్తున్నా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మండిపడ్డారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో 5న జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో శనివారం ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డీఈఓల స్థానంలో జిల్లా కలెక్టర్లను ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. నూతన జిల్లాలకు డీఈఓ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ డీఈఓ, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పైరవీ డిప్యూటేషన్లను రద్దు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హెచ్‌ఎంలు మనోహర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లయ్య, శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌రెడ్డి, రాజేందర్, మురళీకృష్ణ, కృష్ణ, వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్‌లను రద్దు చేయాలి

దుబ్బాకటౌన్: ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్‌లను వెంటనే రద్దుచేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. రాయపోల్ మండలం వీరానగర్, వీరారెడ్డిపల్లి, బంగారం వడ్డేపల్లి, బేగంపేట, సయ్యద్‌నగర్, రాంసాగర్, కొత్తపల్లి, రాయపోల్, అనాజీపూర్ పాఠశాలల్లో శనివారం ఫెడరేషన్ సభ్యత్వ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పైరవీలతో కేటాయించిన డిప్యూటేషన్లు రద్దు చేయాలన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, కరుణాకర్, మెట్టయ్య, వరప్రసాద్, యాదయ్య, నాగ స్వామి, అమరేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ షీ టీమ్స్‌తో మహిళలకు భద్రత: సీపీ

సిద్దిపేటకమాన్: షీ టీమ్స్‌తో మహిళలు, బాలికలకు భద్రత కల్పిస్తున్నాయని సీపీ అనురాధ చెప్పారు. శనివారం ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత నెలలో 50 హాట్‌స్పాట్స్‌పై నిఘా ఏర్పాటు చేసి 43 మందిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో మహిళల రక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఏవరైనా వేధిస్తే మహిళలు, బాలికలు ధైర్యంగా 100కు లేదా షీటీమ్ వాట్సప్ నంబర్ 87126 67434కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు.

◆ రెండు దుకాణాల్లో చోరీ

దుబ్బాక: పట్టణంలో శనివారం తెల్లవారుజామున రెండు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ కీర్తిరాజు కథనం ప్రకారం.. పట్టణంలోని అంగడిబజార్‌లో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఉదయ్‌కల్యాణ్ పెయింట్స్, ఎండీ గౌస్ మొబైల్‌షాపు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి దుకాణాలకు తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం వచ్చి చూస్తే షెటర్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దుకాణాలను తెరచి చూడగా మొబైల్ షాపులో 10 సెల్‌ఫోన్లు, పెయింట్ షాపులో రూ.1,500 నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన ఫోన్ల విలువ రూ.80 వేలు ఉంటుందని బాధితుడు గౌస్ తెలిపారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మున్సిపాలిటీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అవినీతికి సిద్దిపేట మున్సిపాలిటీ నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కౌన్సిల్‌లో బీఆర్‌ఎస్ పెత్తనం ఉందని, అందువల్లే వార్డుల అభివృద్ధి కుంటుపడిందని వాపోయారు. మధు, గాయాజొద్దీన్, హర్షద్, బాబా, ఫయాజ్, నికిల్, చోటు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ మాదక ద్రవ్యాల బారిన పడొద్దు

సిద్దిపేటఎడ్యుకేషన్: మాదక ద్రవ్యాల బారిన పడకుండా యువత తమను తాము రక్షించుకోవాలని వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలైతే భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్లు కనకచంద్రం, తహసీన్ ఫాతిమా, నగేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

తొగుట(దుబ్బాక): గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్ అధికారులు కృషిచేయాలని సీఐ ఎస్‌కే లతీఫ్ ఆదేశించారు. స్థానిక స్టేషన్‌లో శనివారం వీక్లీ పరేడ్ నిర్వహించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు వీపీఓలు బాధ్యతలు తీసుకోవాలన్నారు. తొగుట, రాయపోల్, దౌల్తాబాద్ ఎస్ఐలు రవికాంత్‌రావు, మానస, అరుణ్ పాల్గొన్నారు.

నాలుగేళ్ల పాప అనుమానాస్పద మృతి



శ్రీకృతి(ఫైల్)

దుబ్బాక: పట్టణంలో నాలుగేళ్ల పాప అనుమానాస్పద స్థితిలో శనివారం మృతి చెందింది. ఎస్ఐ కీర్తిరాజు, స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక లాల్ బహదూర్‌శాస్త్రి విగ్రహం సమీపంలో గాడి రంజిత్ ప్లంబర్‌గా జీవనం సాగిస్తున్నాడు. రంజిత్ భార్య లేకపోవడంతో తన కూతురు శ్రీకృతిని చూసుకుంటూ ఉంటున్నాడు. ఈ క్రమంలో స్కూల్‌కు వెళ్లిన శ్రీకృతిని స్కూల్ నుంచి ఇంటికి తీసుకొచ్చాడు. అనంతరం అన్నం తినిపించి పడుకోబెట్టాడు. యూనిఫాం కొనేందుకు బయటకు తీసుకు వెళ్దామని కూతురిని లేపగా లేవలేదు. దీంతో పాపను ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా పల్స్‌రేటు పడిపోయిందని సిద్దిపేట ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు చెప్పారు. పాపను దుబ్బాకలోని వందపడకల ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి శ్రీకృతి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, చిన్నారి మృత దేహాన్ని పోస్టుమార్టమ్ నిమత్తం మార్చురీకి తరలించారు. ఆడుతూ.. పాడుతూ తిరిగే నాలుగేళ్ల శ్రీకృతి మృతిపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.